# దాపరికం లేని జీవితం



గాంధీజీ జీవితం బహిరంగ రహస్యం. అతని మరణం కూడా ఎంతోమంది చూస్తుండగా ఢిల్లీలో సంభవించింది. న్యాయవాద వృత్తి చేపట్టాలని బ్రిటన్‌లో చదువుకున్నా తర్వాత ఆ వృత్తి పట్ల ఏవగింపు కలిగింది. మంచి రాబడి ఉన్న ఆ ఆసరాని వదిలేసి జనావాసాలకు దూరంగా ఉండే ఫీనిక్స్ సెటిల్మెంట్, టాల్‌స్టాయ్ హోమ్, సబర్మతి ఆశ్రమం, వార్ధా ఆశ్రమం... ఇలా జీవనం సాగించారు. మరోవైపు ఆయన కుటుంబ జీవితం ముఖ్యంగా పిల్లల కారణంగా ఏమాత్రం సౌఖ్యంగా లేదు. హరిలాల్ గాంధి, మణిలాల్ గాంధి చేసిన పనులు ఆయనను చాలా ఇబ్బంది పెట్టాయి. హరిలాల్ ఆయన చనిపోయిన ఆరు నెలలకు మరణించాడు. చివరి వరకు హరిలాల్ సమస్య యాతన గానే సాగింది.

విలువలకు కట్టుబడి ఎక్కువ నష్టాలు రాకుండా ఆయన జీవిత కాలంలో ఇండియన్ ఒపీనియన్, నవజీవన్, హరిజన్, యంగ్ ఇండియా మొదలైన పత్రికలను గాంధీజీ విజయవంతంగా నడిపారు. జీవితకాలం పాత్రికేయు డిగా, రచయితగా కొనసాగారు. ఆయన తన తొలి పుస్తకాన్ని మాతృభాష అయిన గుజరాతీలోనే రాశారు. నెహ్రూ అంచనా ప్రకారం గాంధీజీ ఏ విషయాన్ని స్పృశించినా దాని అంతుచూసే రీతిలో అధ్యయనం చేస్తారు. దాని తర్వాతనే నిర్ణయాలు తీసుకుంటారు. అలా పుట్టుకొచ్చినవే 'ఉప్పు సత్యాగ్రహం' వంటి సృజనాత్మకమైన ప్రయోగాలు. ఎలాంటి ఆయుధాలు, ఇతర సామగ్రి లేకుండా అందుబాటులో ఉన్న విశాలమైన సముద్ర తీరంలో ఏ ప్రాంతం వారైనా పాల్గొని తమ పోరాటాన్ని నమోదు చేసే అవకాశం ఇందులో లభించింది.





ఆయనను విమర్శించడమే విచిత్రంగా అని పిస్తుంది. గాంధీజీ పోరాట కాలానికి రైళ్లు పెద్దగా లేవు, పత్రికలు విరివిగా లేవు, రేడియో వ్యాప్తి లేదు. కనీసం పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ కూడా అందుబాటులో లేదు. వీటికి తోడు ఒక భాష కాదు, ఒక సంస్కృతి కాదు. సువిశాలమైన దేశం. అంతకుమించి అడుగడుగునా ఆంక్షలు, అవరోధాలు. ఆయనకు గొప్ప వాగ్ధాటి కూడా లేదు. కానీ కేవలం నిస్వార్థమైన, సహజమైన గాంధీజీ జీవన విధానం, చిత్తశుద్ధి, స్వార్థ రాహిత్యం, క్రమశిక్షణ, పట్టుదల, త్యాగ బుద్ధి మొదలైనవి విద్యాగంధం లేని ఈ దేశంలోని ఎంతోమంది పల్లె ప్రజానీకానికి విపరీతంగా నచ్చాయి. గాంధీజీ వస్తున్నా రంటే మైళ్ల దూరం నడిచి, రైలు మార్గాల దగ్గర రోజుల తరబడి వేచి ఉండేవారు. ఆయన్ను చూసి తరించామని పులకించిపోయేవారు. గాంధీజీ హత్యకు గురయ్యారని తెలిసిన రోజున ఈ దేశంలో కులంతో సంబంధం లేకుండా అత్యధిక జనాభా నదీస్నానం, సముద్ర స్నానం, బావి దగ్గర స్నానం వంటివి చేశారు. ఎందు కంటే గాంధీజీని తమ కుటుంబ వ్యక్తిగా భావించి, విల పిస్తూ ఆ పనికి ఉపక్రమించారు. అంతకుముందు గాని, తర్వాత గాని ఆ స్థాయిలో అంతటి గౌరవం మరే వ్యక్తికి మనదేశంలోగానీ బయటగానీ దక్కలేదు.

గాంధీజీ మన దేశ రాజకీయాలలో ప్రవేశించిన తర్వాత దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి బాబు రాజేంద్రప్రసాద్, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, మృదుల సారాభాయ్, మీరాబెన్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, సి రాజగోపాలాచారి, సర్వేపల్లి రాధాకృష్ణ, జేబీ కృపలాని, టంగుటూరి ప్రకాశం, భోగరాజు పట్టాభి సీతారామయ్య, కమలాదేవి ఛటోపాధ్యాయ, దుర్గాబాయి దేశముఖ్, సరోజినీ నాయుడు, వినోబా భావే, ఎమ్ఎన్ రాయ్, అంబేద్కర్, జయప్రకాశ్ నారాయణ్, రామ్ మనోహర్ లోహియా మొదలైన ఎంతో మంది రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఇలా వీరం దరూ చాలా ప్రత్యేక వ్యక్తిత్వం, స్వభావం, పోరాటశీ లంతోపాటు విభిన్నమైన సామాజిక సైద్ధాంతిక నేప థ్యంతో ప్రజాదరణ గల వేర్వేరు భాషల నాయకులు. వీరందరినీ సంభాళించుకుని కలుపుకుపోవడం అన్నది ఏమాత్రం చిన్న విషయం కాదు.

### అర్థం చేసుకోవడం ఎందుకు?

గాంధీజీని అర్థం చేసుకోవడంలో ఉన్న పరిమితిని సుధీంద్ర కులకర్ణి అనే రచయిత తన 'మ్యూజిక్ ఆఫ్ ద స్పిన్నింగ్ వీల్ ' (2012) అనే గ్రంథంలో విస్పష్టంగా చెప్పారు. 'సూపర్‌ఫీషియాలిటీ లీడ్స్ టు స్టుపిడిటీ'.. దీని అర్థం ఏమిటంటే పైపైన మాత్రమే పరిశీలిస్తే మీకు మిగిలేది అర్థరహితమైన మూర్ఖత్వమే అని. నాలుగైదు దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా గాంధీజీ ఆలోచనలను విధానాలను అన్ని దేశాల్లో అధ్యయనం చేస్తూనే ఉన్నారు. రెండవ ప్రపంచ యుద్ధం విపరిణామాల కార ణంగా పొడచూపిన ఆరోగ్య సమస్యలతో రూపుదిద్దు కున్న పర్యావరణ ఉద్యమం 1972లో మిగతా ప్రాంతా లకు, దేశాలకు విస్తరించింది. దీనికి ఐదు దశాబ్దాల క్రితమే గాంధీజీ కీలకమైన మౌలిక భావనలు ప్రతిపా దించారు. 2019లో చివర్లో మన దేశంలో 'సిటిజెన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్' వస్తున్నదన్న సమాచారం రాగానే ఐడియాలజీ చట్రాలను దాటి గాంధీజీ ఆలోచ నల ఛాయల్లో తలదాచుకునే ప్రయత్నాలు జరిగాయి. పొరుగు దేశపు వ్యక్తికి కూడా సమస్య కలిగించని రీతిలో తన దేశభక్తి ఉంటుందని గాంధీజీ ప్రకటించడమే ఇందుకు కారణం. అలాగే పెద్దపెద్ద పరిశ్రమలు కలి గించే విపత్తులు, విపరిణామాల గురించి ఆలోచించిన ప్పుడు కానీ; మితిమీరిన రీతిలో టెక్నాలజీ వాడకం కలి గించే ఆర్థిక అంతరాలను అవలోకించినప్పుడు కానీ గాంధీజీ తప్పకుండా చర్చనీయాంశమే అవుతారు. ప్రతి సారి మనదేశపు విద్యా విధానాల్లో మార్పులు, చేర్పులు చేసినప్పుడు పక్కన దీపస్తంభంలా దారి చూపే ఆలోచ నలు గాంధీజీ ప్రతిపాదించిన 'నయీతాలీం' విధానం దగ్గరే దొరుకుతాయి. భారత రాష్ట్రపతిగా ఏపీజే అబ్దుల్ కలామ్ ప్రతిపాదించిన 'పుర' (ప్రొవైడింగ్ అర్బన్ అమి నిటీస్ టు రూరల్ ఏరియాస్) మోడల్ అంతర్గత ఆలో చనా చట్రం గాంధీజీ భావనా ప్రపంచమే. 2020లో కరోనా యావత్ మానవాళిని కబళించినప్పుడు గాంధీజీ ప్రబోధించిన సరళమైన, శారీరక శ్రమతో కూడిన జీవన విధానమే శిరోధార్యం అయింది.

కనుకనే నేడు అత్యధిక పుస్తకాలు క్రైస్తవ మతానికి సంబంధించి కాకుండా, గాంధీజీ మీదనే ప్రపంచవ్యా ప్తంగా లభిస్తున్నాయి. అదే స్థాయిలో పరిశోధనలు కూడా సాగుతున్నాయి. మనదేశంలో కేవలం రెండు దశాబ్దాలుగా గాంధీజీ మీద కొత్త దృష్టితో పరిశీలనలు ప్రారంభం కాగా మరోవైపు గాంధీజీ కి బాసటగా నిలి చిన పార్టీ చతికిల పడగానే ఆయన మూర్తిమత్వాన్ని కూడా దెబ్బతీయాలని ఒక పథకం ప్రకారం కృషి జరు గుతున్నది. గాంధీజీ గుండె ఆలోచనలను కేవలం ఆచా రాలుగా పరిమితం చేసి, ఆయా సంస్థల ఆస్తులను అనుభవించే 'అగాంధేయులు' ఈ ధోరణులను ప్రతిఘ టిస్తూ ఆయన చెప్పిన అసలు విషయాలు ఏమిటి అని వివరించడంలో వైఫల్యం చెందుతుండగా; ఇటువైపు ఈ మారీచులు సరికొత్త ఆధునిక విజ్ఞానపు దారులతో రెచ్చిపోతున్నారు. ■